ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
బుధవారం 9 జులై 2025



ఏడాదిలోనే అభివృద్ధి పరుగు

● ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా అధికారులు ● జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత

జగన్ హయాంలో అభివృద్ధి శూన్యం

కడప, జూలై 8(ఆంధ్రజ్యోతి): "ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాదిలోనే రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారు. జగన్ హయాంలో ఐదేళ్లలో అభివృద్ధి అనే మాటే లేదు. ఇప్పుడు తొలి ఏడాదిలోనే సిమెంటు రోడ్లు, మురుగుకాల్వలు, తారురోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రజలకు ప్రభుత్వానికి అధికారులు వారధులుగా పనిచేయాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు" అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితి సింగ్

వ్యవసాయశాఖపై అసంతృప్తి

వ్యవసాయశాఖపై ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, పుట్టా సుధాకరయాదవ్, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించడం లేదన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మొబైల్ యాప్ తయారు చేశారని, ఆ యాప్ ద్వారా వ్యవసాయశాఖ అధికారులు ఎప్పుడు ఎక్కడికి వెళుతున్నారనేది తెలుసుకోవచ్చన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌పై చర్చ జరుగుతుండగా 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇవ్వడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలో సుమారు 84 టీఎంసీల నీరు నిల్వ చేసుకనే ప్రాజెక్టులున్నాయని, ఇక్కడ చేపల పెంపకం ప్రోత్సహిస్తే కోస్తాకు మించి అనుకూలంగా ఉంటుందని కలెక్టర్ వివరించారు. మత్స్యశాఖకు సంబంధించిన పథకాలు తెలియడం లేదని జనం అడిగారంటూ మంత్రి సవిత ఆ శాఖ అధికారులకు చురక అంటించారు.

స్వయంసహాయక సంఘాలకు బ్యాంకర్ల చేయూత

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు బ్యాంకులు చేయూత ఇస్తున్నాయని కలెక్టర్ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇరిగేషన్ కాల్వలు, కాంపౌండువాల్, రోడ్లు, శ్మశానాల ప్రహరీగోడల పనులు చేపట్టామన్నారు. అన్ని మండలాల్లో మినీగోకులాలు, రైతుల అవసరాలు బట్టి చిన్న చిన్న జీవాలషెడ్లు నిర్మించామన్నారు. సీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ సోలార్‌విద్యుత్ వాడి బిల్లు తగ్గించే చర్యలు చేపడుతున్నామన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ సిస్టం ద్వారా ఎఫ్ఈవోల ద్వారా ఉచితంగా ఇవ్వడానికి వేరుశనగ, ఆముదం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేస్తున్నామన్నారు.

డీఎంహెచ్‌వో, ఆర్టీసీ ఆర్ఎంను సరెండర్ చేద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని జిల్లా సమీక్ష సమావేశంలో నిర్ణయించారు. ఎమ్మెల్యేలు చెప్పినా వారిద్దరూ స్పందించక పోవడంపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే అధికారులు అవసరం లేదని అన్నారు.



కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి మాట్లాడుతూ కడప కార్పొరేషన్ పరిధిలో ఉండడంతో ఉపాధి హామీ అమలు కావడం లేదని, కడప నియోజకవర్గంలోనూ పల్లెలున్నాయని అక్కడ రైతులు ఉన్నారని అన్నారు. ఇక్కడి రైతులకు మినీ గోకులాల నిర్మాణం చేపట్టాలని కోరారు. కడప రైతుబజారులో వసతులు లేక జనం అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్టీఆర్ హౌసింగ్ పథకానికి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

సీఎం హామీల అమలేదీ..?

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మైదుకూరు పర్యటన సందర్భంగా రూ.120 కోట్ల హామీలు ఇచ్చారు. అవి ఇంకా అమలు కాలేదని, ప్రతిపాదనలకు కూడా నోచుకోలేదని ఎమ్మెల్యే పుట్టా సుధాకరయాదవ్ సభ దృష్టికి తెచ్చారు. మహానాడు సందర్భంగా రూ.1000 కోట్లు సర్వరాయసాగర్ ప్రాజెక్టుకు మంజూరు చేస్తున్నట్లు సీఎం హామీ ఇచ్చారు. కడపలో చెరువుల అభివృద్ధికి నిధులు ఇస్తున్నట్లు వెల్లడించారు. నెలన్నర దాటినా ఇంకా ఆ హామీల ప్రతిపాదనలు ముందుకు పోలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు. సర్వరాయసాగర్ ప్రాజెక్టు ఎస్టిమేట్ వారంలో పంపుతామని ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరామయ్య వెల్లడించారు. పశుసంవర్ధకశాఖ ద్వారా తీసుకునే రుణాలకు బ్యాంకులు ష్యూరిటీ అడుగుతున్నట్లు జేడీ శారదమ్మ సమావేశం దృష్టికి తెచ్చారు. రూ.5కోట్ల వరకు ఎలాంటి పూచీ ఇవ్వాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు.



ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ సదరం ఎంట్రీలు ఆన్‌లైన్‌లో మూడుసార్లు చేస్తే తరువాత ఎంట్రీ చేయడానికి సైట్‌లో అవకాశంలేదని ఈ సమస్య పరిష్కరించాలని మంత్రిని కోరారు.



మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో సీజన్‌గా పండిస్తున్న పంటలు, తెగుళ్లనివారణ, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మైదుకూరులోని మార్కెట్‌యార్డులో పైపులు నిల్వ ఉంచి రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని, వాటిని వెంటనే తొలగించాలని మార్కెట్‌శాఖ అధికారులను కలెక్టరు ఆదేశించారు.



జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిరుపయోగంగా ఉన్న టిడ్కో, ఎన్టీఆర్ గృహాలను లబ్ధిదారులకు అందించాలన్నారు. జిల్లాలో సాగునీటి పారుదలపై వారంలో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వెల్లడించారు. ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై సుదీర్ఘంగా చర్చ సాగింది. ఉపాధి నిధుల్లో 15శాతం మట్టిరోడ్లకు కేటాయించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి కోరగా కలెక్టర్ అంగీకరించారు.

హనుమంత వాహనంపై సౌమ్యనాథుడు

● వైభవంగా బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి హనుమంత వాహనంపై సౌమ్యనాథ స్వామి ఆశీనులై శ్రీరామ చంద్రుడి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామోత్సవం నందలూరు పేటగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా బస్టాండు కూడలి వరకు కొనసాగింది. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు : బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శేషవాహనం గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రి గరుడవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



ఆలయం వద్ద మహిళల కోలాటం



హనుమంత వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతున్న సౌమ్యనాథుడు

జిల్లాలో విజయవాడ పోలీసులు

(కడప-ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం అంకనివారిపల్లెకు చెందిన సుదర్శన్‌రెడ్డికోసం మంగళవారం విజయవాడ పోలీసులు జిల్లాకు వచ్చారు. జగన్ పాలనలో ఇతను భారతి ఇన్‌ఫ్రా టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఓ సంస్థ ఏర్పాటు చేశారు. అప్పట్లో 'నాడు-నేడు' పేరుతో పాఠశాలలను ఆధునీకరించే పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో సుదర్శన్‌రెడ్డి పాఠశాలలకు అవసరమైన గ్రీన్‌చార్ట్ బోర్డును సరఫరా చేస్తానంటూ రూ.2 వేల విలువ చేసే పలకలను అడ్డగోలుగా రూ.7400 వంతున కొట్టేసేందుకు స్కెచ్ వేశారు. ఇందుకోసం రూ.25 లక్షలు గుడ్‌విల్ కింద తీసుకున్నట్లు సమాచారం. ఈ గోల్‌మాల్ వ్యవహారంపై చంద్రబాబు ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు జిల్లాకు వచ్చి సుదర్శన్‌రెడ్డి కోసం ఆరా తీస్తున్నారు.

సింగిల్ విండోలకు పాలకవర్గాలు

కలికిరి/కడప రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లాలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పాక్స్)కు నామినేటెడ్ పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 491 సొసైటీలకు మంగళవారం పాలకవర్గాలు ఖరారు కాగా అందులో జిల్లాలోని 10 సంఘాలకు స్థానం దక్కింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ప్రతిపాదించిన పాలకవర్గాల పేర్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాలకవర్గాలకు అతి తక్కువ గడువు మాత్రమే కల్పించారు. ప్రస్తుతం నియామకమైన పాలకవర్గాలు ఈ ఏడాది జూలై 30 వరకూ మాత్రమే పదవుల్లో కొనసాగనున్నాయి. ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు పగ్గాలు చేపట్టే వరకు గానీ లేదా తదుపరి ఉత్తర్వుల వరకుగానీ ప్రస్తుత పాలకవర్గాల కొనసాగనున్నాయని వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ మంగళవారం జారీచేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు.

పాలకవర్గాల వివరాలు

వెల్లటూరు సొసైటీకి చైర్మన్‌గా గొల్లయ్యగారి సురేంద్ర రెడ్డి, సభ్యులుగా సి.పాలేటి, వి.పుష్పరాజు, వల్లూరు సొసైటీకి చైర్మన్‌గా ఎల్.నాగేశ్వర రెడ్డి, సభ్యులుగా వై.శివారెడ్డి, డి.నాగేంద్ర, నాగిరెడ్డిపల్లె సింగిల్ విండోకు గంధం మోహన్‌బాబు చైర్మన్‌గా, వై.గురుప్రసాద్, గుర్రంపాటి బాలిరెడ్డి సభ్యులుగా నియమితులయ్యారు. అలాగే విభరాపురం సొసైటీ చైర్మన్‌గా ఎల్.వాసుదేవ రెడ్డి, పుత్తా యల్లారెడ్డి, గుజ్జుల సూర్యబాబులు సభ్యులుగా నియామకమయ్యారు. నల్లింగాయపల్లె సొసైటీకి చైర్మన్‌గా సుధా సుధాకర్ రెడ్డి, సభ్యులుగా బి.నాగమల్లా రెడ్డి, గజ్జల సుబ్బారెడ్డి, యర్రగుడిపాడు పాక్స్ చైర్మన్‌గా లేబాక గోపాల్ రెడ్డి, సి.హరినాథ రెడ్డి, వై.లక్ష్మీదేవి సభ్యులుగా, పెద్దచెప్పలి సొసైటీకి చైర్మన్‌గా బి.వెంకటసుబ్బా రెడ్డి, సభ్యులుగా యు.రామకృష్ణా రెడ్డి, ఎస్.సుబ్బరాయుడు నియామకం పొందారు. బ్రాహ్మణపల్లె సొసైటీకి చైర్మన్‌గా టి.రామానాయుడు, సభ్యులుగా సి.అన్నపూర్ణమ్మ, ఎ.రామయ్య, అట్లూరు సొసైటీకి చైర్మన్‌గా ఎం.సూర్యనారాయణ రెడ్డి, సభ్యులుగా బి.నందగోపాల్ రెడ్డి, పి.రాధాకృష్ణా రెడ్డి, గోనుమాకులపల్లె సొసైటీ చైర్మన్‌గా ఎస్ఎన్ వెంకటరమణారెడ్డి, సభ్యులుగా ఎన్.రమణా రెడ్డి, ఎన్.రామాంజనేయ రెడ్డి నియామకమయ్యారు.

అనుమతులకు మించి గ్రావెల్ తవ్వకాలు

● రూ.7.73 లక్షల జరిమానా

దువ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం క్రీస్తురాజపురం సమీపంలో అనుమతికి మించి గ్రావెల్ తవ్వుతున్న కంపెనీకి జరిమానా విధించినట్లు భూగర్భ గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సాయి వెల్లడించారు. మంగళవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మైదుకూరు ప్రాంతంలో జరుగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి దువ్వూరు ప్రాంతంలో 139/1ఎ2 సర్వే నంబరులో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వగా పరిమితికి మించి తవ్వకాలు చేసినట్లు గుర్తించామన్నారు. జూన్ 18వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'కప్పం కట్టాల్సిందే' అనే శీర్షికన అక్రమ తవ్వకాల విషయంపై కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన భూగర్భ గనుల శాఖ అధికారిణి రాధ, దువ్వూరు రెవెన్యూ అధికారులతో కలిసి వెళ్లి తవ్వకాలను పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా అదనంగా 0.93 ఎకరాల విస్తీర్ణంలో తవ్వకాలు జరిపినట్లు గుర్తించామని డిప్యూటీ డైరెక్టర్ సాయి వెల్లడించారు. ఈ మేరకు సదరు కంపెనీకి రూ.7,73,664 జరిమానా విధించామనానరు.

ఆంధ్రజ్యోతి

ఎవరూ అధైర్యపడొద్దు

● ప్రజాదర్బార్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్



పులివెందుల క్యాంప్ కార్యాలయం వద్ద వైఎస్ జగన్

పులివెందుల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మళ్లీ మంచిరోజులు వస్తాయని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. రెండురోజుల పర్యటనలో భాగంగా సోమవారం పులివెందులకు చేరుకున్న జగన్ మంగళవారం ఉదయం 7.45 గంటల ప్రాంతంలో ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌కు వెళ్లారు. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా అక్కడ నివాళులు అర్పించారు. అనంతరం 11గంటల ప్రాంతంలో పులివెందులలోని క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఆయన రాకకోసం అభిమానులు, కార్యకర్తలు, నాయకులు క్యాంప్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఎదురుచూస్తున్నారు. వీరందరూ జగన్‌ను కలిసేందుకు పోటీపడ్డంతో తోపులాట జరిగి క్యాంప్ కార్యాలయానికి ఉన్న ఒక కిటికీ అద్దం పగిలిపోయింది. ఈ సందర్భంగా పలువురు జగన్‌ను కలిసి వారి వ్యక్తిగత సమస్యలను విన్నవించారు. జగన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పినవేమీ చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ మంచిరోజులు వస్తాయని, అందరికీ తగిన న్యాయం చేస్తామన్నారు. మధ్యాహ్నం 2.45గంటల ప్రాంతంలో హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి సతీశ్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ కోసం రైతులకు 13వరకు గడువు

కడప రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు 13 తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ తెలిపారు. జిల్లాలో 1,97,000 రైతులు అర్హులుగా గుర్తించామన్నారు. ఇందులో 1,800 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. అలాగే అనర్హమైన 15,000 ఖాతాలు తహశీల్దార్ల పరిధిలో ఉన్నాయన్నారు. దీనికి సంబంధించిన జాబితా ఆర్ఎస్‌కె సిబ్బంది వద్ద ఉందన్నారు. అనర్హులుగా ఉన్నవారు రెవెన్యూ సిబ్బందిని కలిసి రెవెన్యూ రికార్డులో తప్పులు సరిదిద్దుకుంటే అర్హులవుతారన్నారు. మ్యుటేషన్ అయిన వారు, తప్పుడు ఆధార్ మ్యాప్ అయిన వారు, జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నవారు రెవెన్యూ వారిచే సరి చేయించుకోవాలన్నారు. ఈ పథకంలో ఇప్పటికే అర్హులైన రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శనకు ఉంచామన్నారు.

200 మందిపై హత్యాయత్నం కేసు

● డీఎస్పీ మురళీనాయక్



పులివెందుల, జూలై 8(ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌పై, పోలీసులపై జరిగిన రాళ్లదాడి సంఘటనలో 150 నుంచి 200 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు. వేంపల్లెలో బాలిక అదృశ్యం, పోలీస్‌స్టేషన్‌పై జరిగిన దాడికి సంబంధించి కేసు నమోదు అంశాలపై ఆంధ్రజ్యోతి డీఎస్పీని ప్రశ్నించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలిక మేకలను మేపుకునేందుకు వెళ్లి అదృశ్యమైందని, అందుకు కొంతమంది యువకులే కారణమని వారిని సాయంత్రం 4గంటల ప్రాంతంలో పోలీసులకు బాలిక బంధువులు అప్పగించారన్నారు. మళ్లీ ఒక్కొక్కరుగా వందలాది మంది పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి ఆ యువకులను వారికి అప్పగించాలని డిమాండ్ చేశారన్నారు. దీనిపై విచారిస్తున్నామని సీఐ నరసింహులు వారికి చెప్పారన్నారు. అయినా వినకుండా పోలీస్‌స్టేషన్‌పై, పోలీసులపై రాళ్ల దాడులకు దిగారన్నారు. ఈ రాళ్లదాడిలో పోలీస్‌స్టేషన్‌లో సామాగ్రి ధ్వంసమైందన్నారు. కొందరు చొరబడేందుకు ప్రయత్నించారన్నారు. పోలీసులు చెబుతున్నా వినిపించుకోకుండా విచక్షణ రహితంగా ప్రవర్తించారన్నారు. చివరకు తాను వెళ్లి సర్దిచెప్పినా పట్టించుకోకుండా దాడికి దిగారన్నారు. గంటలో బాలికను మీ ముందుకు తెస్తానని చెబుతున్నా పట్టించుకోలేదన్నారు. పబ్లిక్ ఆస్తిని ధ్వంసం చేసినందుకు, పోలీసులపై హత్యాయత్నం చేసినందుకు కేసులు నమోదు చేశామన్నారు. 150 నుంచి దాదాపు 200 మందిపై ఈ కేసులు నమోదు చేశామన్నారు. అవసరమైతే 500 మందిపైన అయినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ ఘటన వెనుక అదృశ్య శక్తులు పనిచేసినట్లు తమకు సమాచారం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠినచర్యలు తప్పవన్నారు.

దోపిడీ

● స్టాంపుల కొరతతో వెండర్లు, కామన్ సర్వీస్ సెంటర్లకు కాసులు

● రూ.10 స్టాంప్ రూ.50.. రూ.50ది రూ.150.. రూ.100ది రూ.500

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనిపించని స్టాంపులు





పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పులివెందుల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): స్టాంప్ పేపర్ల కొరత తీవ్రంగా ఉంది. దీంతో దోచుకున్నోడికి దోచుకున్నంత అన్నట్లు స్టాంప్ వెండర్లు, కామన్ సెంటర్ల నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. రూ.100 స్టాంప్ కావాలంటే స్టాంప్ వెండర్లు రూ.500 వసూలు చేస్తున్నారు. కామన్ సెంటర్లలో ఈ-స్టాంపులు రూ.10 స్టాంప్ రూ.50.. రూ.50ది రూ.150.. ఇలా అధిక ధరలతో ప్రజలను పిండేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత తీవ్రంగా ఉండడం దండుకున్నోడికి దండుకున్నంత అన్న రీతిలో సాగుతోంది. పులివెందులలో ఈ వ్యవహారం మరింత ఎక్కువగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. స్టాంపు వెండర్లు, కామన్ సర్వీస్ సెంటర్లలో దోపిడీ సాగుతోంది. భూముల రిజిస్ట్రేషన్లకు, బ్యాంకు రుణాలకు తదితర వాటికి నాన్ జ్యుడీషియల్ స్టాంపులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయిస్తారు. లైసెన్స్ ఉన్న స్టాంప్ వెండర్ల వద్ద స్టాంపులు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ-స్టాంపులు అందుబాటులో ఉంటాయి. పులివెందులలో సబ్‌రిజిస్ట్రార్ అధికారుల సమాచారం ప్రకారం నాలుగు కామన్ సెంటర్లలోను ఈ-స్టాంపులు పొందే అవకాశం ఉంది. అలాగే నలుగురు స్టాంప్ వెండర్ల వద్ద కూడా నాన్‌జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉంటాయి. అయినప్పటికీ దాదాపు రెండు నెలల నుంచి స్టాంపులకొరత తీవ్రంగా ఉంది. నెల క్రితం పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి స్టాంపులు అందాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు స్టాంపులు సరఫరా కాలేదు. స్టాంప్ వెండర్ల వద్ద ఉన్న స్టాంపులతోను, ఈ-స్టాంపులతో రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. ఇటీవల స్టాంపుల కొరత ఎక్కువ కావడంతో కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ-స్టాంపులకు నాలుగైదు రెట్లు అధికమొత్తం వసూలు చేస్తున్నారు. బ్యాంకుల్లో ప్రస్తుతం రైతులు పంట రుణాలకు రెన్యువల్స్ సాగుతున్నాయి. పది ఎకరాలకు పైన ఉన్న రైతులు బ్యాంకు వారు ఇచ్చే పత్రాలపైన రూ.600 స్టాంపులు అతికించి వాటికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సీల్ వేయాల్సి ఉటుంది. వీటికి కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే ఇది ఇంతే అని సమాధానం వినిపిస్తోంది.

జిల్లాలో అన్నిచోట్లా ఇదే దుస్థితి

జిల్లాలో ఉన్న 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. ఒకటి రెండు చోట్ల స్టాంపులు ఉన్నా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాక్ లేకపోతే స్టాంపు వెండర్ల వద్దకు పరుగులు తీయాల్సిందే. అవసరమైతే తీసుకో లేదంటే లేదని అక్కడ సమాధానం వస్తోంది. దీంతో అవసరమున్న వారు అధిక డబ్బులు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు.

జిల్లా అధికారుల నుంచే సప్లై లేదు

తమకు అవసరమైన స్టాంపు పేపర్లు జిల్లా కేంద్రం నుంచి సరఫరా లేదని పులివెందుల సబ్‌రిజిస్ట్రార్ మోహన్ పేర్కొన్నారు. స్టాంపుల కొరత విషయమై ఆయనను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రస్తుతం స్టాంపుల కొరత ఉందన్నారు. అయినా పులివెందులలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. నలుగురు స్టాంపు వెండర్ల వద్ద స్టాంపులు, కామన్ సెంటర్లలో ఈ-స్టాంపులు ఉన్నాయన్నారు. అనంతపురం జిల్లాలో స్టాంపుల కుంభకోణంపై విచారణ సాగుతుండడం వల్ల కొంత సరఫరా లేదన్నారు. జిల్లా అధికారులకు స్టాంపుల కొరతపై వివరించామని, వారి నుంచి రావాల్సి ఉందన్నారు.

సింగిల్‌విండోలకు త్రీమెన్ కమిటీల ఎంపిక

● జిల్లాలో 41 సొసైటీలకు పేర్ల ప్రతిపాదన ● 13 విండోలకు ప్రభుత్వం ఆమోదం ● ఉత్తర్వుల జారీ..పోటీ ఉన్న వాటిపై పరిశీలన

మదనపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (సింగిల్ విండో)కు త్రీమెన్ కమిటీ జాబితాను ఆ శాఖాధికారులు ప్రభుత్వానికి పంపారు. జిల్లాలోని 41 సొసైటీలకుగాను ఈ జాబితాలో 13 విండోలకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేస్తూ మంగళవారం జీవో ఆర్టీ నంబర్ 543 జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంపుతున్న ఈ జాబితా నాలుగోది అయినా, ఇది అనధికార జాబితా. రెండో విడత పంపిన జాబితా పదవీ కాలం జూన్ 20కి పూర్తికాగా, తర్వాత పంపిన మూడో జాబితా 40 రోజుల గడువు ఈ నెలాఖరుకు పూర్తి కానుంది. ఇప్పటి వరకూ ఆరేళ్ల నాన్ అఫిషియల్, అఫిషియల్ పీఏసీలకు ఆరేళ్ల పూర్తి కానున్న నేపథ్యంలో మూడోసారి పంపిన జాబితా 40 రోజులకే పరిమితం అయింది. ఇక నాలుగోసారి పంపిన జాబితాపై ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో మూడువిడతలుగా అంటే ఆరు నెలల చొప్పున రెండుసార్లు, 40 రోజుల గడువుతో మూడోసారి కమిటీని పొడిగిస్తూ వచ్చింది. తాజాగా పంపిన జాబితాను చూస్తే.. గత వైసీపీ ప్రభుత్వంలోని అయిదేళ్ల తరహాలోనే సహకార ఎన్నికలకు వెళ్లకుండా రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తోంది. అంటే అధికారిక పర్సన్ ఇన్‌చార్జి కాకుండా, ముగ్గురు సభ్యులతో కూడిన నాన్‌అఫిషియల్ కమిటీనే ఎంపిక చేసింది.


తంబళ్లపల్లెలోని సింగిల్‌విండో కార్యాలయం

అన్నమయ్య జిల్లాలో 30 మండలాలుండగా మదనపల్లె, రాజంపేట సహకార డివిజన్లలో 41 సింగిల్ విండోలు ఉన్నాయి. అప్పటి ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల్లో 2013 నవంబరులో సహకార సొసైటీలకు ఎన్నికలు జరగ్గా, పాలకవర్గాలు కొలువుతీరాయి. 2018 నవంబరు నాటికి ఆయా పాలకవర్గాల గడువు పూర్తి కాగా.. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి స్థానంలో ఆరునెలల వ్యవధితో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి(పీఏసీ)ల పేరుతో రాజకీయ నిరుద్యోగులకు అవకాశం కల్పించింది. 2024 ఎన్నికల వరకూ నాన్ అఫిషియల్ పీఏసీ ఇన్‌చార్జీల పదవులు కొనసాగాయి. తర్వాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో నియమించిన త్రీమెన్ కమిటీలను తొలగించింది. రాజకీయాలకు అతీతంగా సహకారశాఖ ఉద్యోగిని అఫిషియల్ పీఏసీగా నియమించింది. ఇలా రెండుసార్లు ఏడాది పాటు వారు కొనసాగగా, మూడోసారి కూడా అదే కమిటీని కొనసాగించింది. అయితే యథాప్రకారం ఆరునెలల వ్యవధి కాకుండా 40 రోజులకే పరిమితం చేసింది. పాలకవర్గం లేకుండా నియమించే అఫిషియల్, నాన్ అఫిషియల్ కమిటీలను ఆరేళ్లకు మించి పొడిగించ కూడదని సహకార చట్టంలోని నిబంధనలు చెబుతున్నాయి. దీన్ని పరిగణలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం ఆ నిబంధనకు లోబడి 40 రోజులకే మూడో సారి కమిటీని పరిమితం చేసింది. అయితే ఈసారి నాన్‌అఫిషియల్ త్రీమెన్ కమిటీకి మొగ్గు చూపింది.

జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల నుంచి కూటమి ఎమ్మెల్యేలు, వైసీపీ అధికారంలో ఉన్న రాజంపేట, తంబళ్లపల్లెలో టీడీపీ ఇన్‌చార్జిల నుంచి ఆ శాఖ ఉన్నతాధికారులు జాబితా తెప్పించుకున్నారు. ఇలా రెండు నియోజకవర్గాల్లో ఆయా మండలాల వారీగా ఎంపిక చేసే జాబితా ఆలస్యం చేసినట్లు తెలిసింది. దీంతో ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు సభ్యుల జాబితా ఇవ్వగా, సొసైటీ స్థాయిలో ఆ సభ్యులపై సీఈవో విచారణ, వివరాలు తీసుకుని డివిజన్ స్థాయిలో డీఎల్‌సీవో, జిల్లాలో స్థాయిలో డీసీవో నుంచి సహకారశాఖ రాష్ట్ర కమిషనర్‌కు జాబితా పంపారు. ఈ నెలాఖరులోగా ఆ జాబితాకు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సిఉండగా, రాష్ట్ర వ్యాప్తంగా 468 సొసైటీల్లో త్రీమెన్ కమిటీల నియామకాలకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం జీవో ఆర్టీ నంబర్ 543 జారీ చేసింది. అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లో 41 సింగిల్ విండోలు ఉండగా, మొదటి విడతగా 13 సొసైటీలకు కమిటీలను ప్రకటించింది. అలాగే చిత్తూరు జిల్లాలో ఏడు, తిరుపతి జిల్లాలో మూడు, వైఎస్ఆర్ కడప జిల్లాలో తొమ్మిది సొసైటీలకు కమిటీలను ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక, అఫిషియల్ కమిటీనే నియమించింది. ఈ మధ్యలో ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు..ఆయా మండలాల్లోని కూటమి పార్టీల ఆశావహులకు సింగిల్ విండో ఛైర్మన్‌గా అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు.

కానీ ఏడాదికాలం అధికారిక పీఏసీ ఉండటంతో అప్పటికీ, ఇప్పటికీ ఆయా మండలాల్లోని అభ్యర్థుల


నిమ్మనపల్లె సహకార సొసైటీ కార్యాలయం

జాబితా మారినట్లు చెబుతున్నారు. తాజాగా ఆయా శాసనసభ్యులు ప్రభుత్వానికి పంపిన జాబితాలకు ఆమోదం లభించింది. అయితే ఒకే సొసైటీకి ఇద్దరు ముగ్గురు పోటీ ఉన్న, గ్రూపు రాజకీయాలున్న నియోజకవర్గాల్లోని మండలాల్లో ఈ ఎంపిక వాయిదా పడినట్లు చెబుతున్నారు. పోటీ అధికంగా ఉన్న స్థానాలకు సంబంధించిన జాబితాలు ఇంకా పంపనట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం ఈ నెలాఖరులోగా మిగిలిన విండోలకు కూడా కమిటిని ప్రకటించే విషయంపై ఆశాఖ అధికారులు.. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

13 సింగిల్ విండోల పాలకవర్గాల జాబితా..

కలికిరి: పీలేరు నియోజకవర్గంలోని పీలేరు సొసైటీకి ఛైర్మన్‌గా వై.రెడ్డెప్ప రెడ్డి, డైరెక్టర్లుగా ఎ.పుల్లయ్య, ఎస్.అమానుల్లాల, కలికిరి సింగిల్ విండో ఛైర్మన్‌గా నల్లారి చంద్రకుమార్ రెడ్డి, డైరెక్టర్లుగా జె.సుబ్బయ్య, ఎస్.అల్లాబక్షు, గుర్రంకొండకు ఛైర్మన్‌గా ఎం.ఎల్.ఎన్. మూర్తిరావు, డైరెక్టర్లుగా ఎంఎస్ సలార్ సాహెబ్, ఎన్.సత్యనారాయణ రెడ్డి, కలకడకు ఎం.వెంకట్రమణ నాయుడు ఛైర్మన్‌గా, ఎం.వెంకట్రమణ, బి.గిరిజమ్మ డైరెక్టర్లుగా, కేవీపల్లెకు ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి ఛైర్మన్‌గా కె.వెంకట్రమణ, డి.నారాయణ నాయుడు డైరెక్టర్లుగా, వాయల్పాడు సొసైటీకి కె.కృష్ణా రెడ్డి ఛైర్మన్‌గా, పి.మొహిద్దీన్ అలీఖాన్, ఎ.మధు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. కోడూరు నియోజకవర్గంలోని వీపీఆర్ కండ్రిగ సొసైటీకి ఛైర్మన్‌గా డి.కృష్ణంరాజు, డైరెక్టరుగా సి.వెంకట్రామయ్య, ఎం.నరసింహులు, ఆర్ఆర్ పురం సొసైటీకి తిమ్మిసెట్టి సుబ్రమణ్యం ఛైర్మన్‌గా, బి.చంద్రయ్య, కె.మునీంద్ర డైరెక్టర్లుగా, చిట్వేలుకు మద్దిన సుమిత్ర ఛైర్‌పర్సన్‌గా, గూడూరు నాగరాజ, మురగాని వెంకట్రమణ డైరెక్టర్లుగా నియామకాలు పొందారు. రాయచోటి నియోజకవర్గంలోని రామాపురం మండలం సరస్వతిపల్లె సొసైటీకి గాలివీటి సురేంద్ర రెడ్డి ఛైర్మన్‌గా, పి.నాగేంద్ర, పి.నాగరాజ డైరెక్టర్లుగా, లక్కిరెడ్డిపల్లె మండలంలోని మద్దిరేవుల సొసైటీకి బత్తిన దేవేంద్ర రెడ్డి ఛైర్మన్‌గా జి.రెడ్డెయ్య, వి.బాబావక్రుద్దీన్ డైరెక్టర్లుగా, రామాపురం మండలంలోని కొలిమివాండ్లపల్లె సొసైటీకి అయోధ్యపురం భాస్కర్ రెడ్డి ఛైర్మన్‌గా, ఎన్.సహదేవ రెడ్డి, సి.చంద్రశేఖర్, డైరెక్టర్లుగా, గాలివీడు మండలంలోని నూలివీడు ప్యాక్స్‌కు పేరం ప్రభాకర్ రెడ్డి చెర్మన్‌గా, పి.మిట్టేనాయక్, బి.లోకేశ్వర డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

డిజిటల్ ఎంసీపీలు పూర్తి చేయాలి


వెలుగు ఏపీఎంలకు సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె టౌన్, జూలై 8 (ఆంధ్ర జ్యోతి): స్వయం సహాయక సంఘాల డిజిటల్ ఎంసీపీలు పూర్తి చేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాయలంలో నిర్వహించిన జేఎంఎల్‌బీసీ సమావేశంలో పీడీ మాట్లాడుతూ 2025-26కు గ్రామాల్లో మహిళా సంఘాల డిజిటల్ ఎంసీపీలు పూర్తి చేసే విధంగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. బ్యాంకు లింకేజి, స్త్రీనిధి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సంఘ సభ్యులకు జీవనోపాధి కల్పించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. సభ్యుల నుంచి రుణాల రికవరీ సమయానికి పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో ఏపీఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ సీసీలతో సమావేశం నిర్వహించి ప్రణాళిక ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీపీఎం లక్ష్మీప్రసాదరెడ్డి, బ్యాంకు లింకేజి బీపీఎం, క్లస్టర్‌లోని అన్ని మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ రమేష్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గృహనిర్మాణ పనులను తక్షణం పూర్తి చేసేందుకు కృషి చేయాలని హౌసింగ్ ఈఈ రమేష్‌రెడ్డి తమ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం డీఈ వెంకటరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈ శ్రీకాంత్‌తో కలసి మండలంలోని కందుకూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లా డారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన గృహాలకు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేసిందని, లబ్ధిదారులు దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. శ్రావణమాసంలో గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని అందుకే నిర్మాణాలను పూర్తి చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


పశుగ్రాసం పెంపుపై రైతులకు వివరిస్తున్న గుణశేఖర్ పిళ్లై

నందలూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులతో వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. నందలూరు మండలం పాటూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పశుగ్రాస వారోత్సవాల్లో ఆయన పశుగ్రాసాల్లో రకాలు ప్రాముఖ్యత, సాగులో మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఉపసంచాలకులు డాక్టర్ విజయ భాస్కర్‌రావు, రాజంపేట సహాయ సంచాలకులు డాక్టర్ ప్రతాప్, డాక్టర్ లోకేష్, నందలూరు పశువైద్యులు ఈశ్వర్‌ప్రసాద్, డాక్టర్ మాధవీలత, జేవీవోలు సుగుణ, గంగులయ్య, వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏ జాహ్నవి, శ్రీనాథ్, సుస్మిత, శివరాం, గులాబ్‌జాన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


● రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్



జనసేనపార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నాయకులు


చిట్వేలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు నియోజక వర్గ అభి వృద్ధే తన ధ్యేయమని, కోడూరును అన్నివిధాల అభివృద్ధి చేయ డమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. మంగళవారం చిట్వేలి జనసేనపార్టీ కార్యాలయంలో ఆయన విలే కరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విమర్శలకు ఆయన స్పందిస్తూ గత పాలనలో నియోజకవర్గాన్ని అభివృద్ధికి దూరం చేశారని ఆరోపించారు. వేదిక ఏర్పాటు చేస్తే ఎవరి కాలంలో అభివృద్ధి జరిగిందో మాట్లాడుకుందామని సవాల్ విసిరారు. రోడ్లు, పాఠశాలలు, పెన్షన్‌లు వంటి అభివృద్ధి కార్య క్రమాల్లో ముందుకు దూసుకు పోతున్నామన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గా నికి ఏమి చేశారో ప్రజలకు వివ రించాలన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ గత ఐదేళ్లలో మాజీ ఎమ్మెల్యే పంచాయతీరాజ్ నిధులు తెప్పించింది కేవలం రూ.12 కోట్లు మాత్రమేనని, ఇప్పటికి అరవ శ్రీధర్ తెచ్చిన నిధులు రూ.32 కోట్లు అని ఎద్దేవా చేశారు. జనసేన మండల నాయకుడు మాదాసు నరసింహ, జోగినేని మణి మాట్లాడుతూ అరవ శ్రీధర్‌ను విమర్శించే స్థాయి సొంత ఊరికే బ్రిడ్జి కట్టుకోలేని మాజీ ఎమ్మెల్యేకు లేదన్నారు. కార్యక్రమంలో తుపాకుల పెంచలయ్య, రియాజ్, సుధీర్‌రెడ్డి, శివశంకర్, మాదాసు శివ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి'


బైకు ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈనెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యా లయం నుంచి పాతబస్టాండు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవి కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీహరి మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాపాడాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. కార్మికులపై పనిభారం తగ్గించి, లేబర్‌కోడ్ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు.

శేషవాహనంపై సిద్దేశ్వరస్వామి


శేషవాహనంపై ఊరేగుతున్న సిద్దేశ్వరస్వామి

రాజంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాకలోని చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సిద్దేశర్వస్వామి శేష వాహనంపై దర్శనమిచ్చారు. చెన్న కేశవ స్వామిని పల్లకీపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి..

రైల్వేకోడూరు రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంధంవాడ్లపల్లి సమీపంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వేకోడూరు ఎస్‌ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు చిట్వేల్ మండలం మల్లెంవారిపల్లెకు చెందిన కేనేటి పెంచలయ్య(45) కోడూరు పట్టణంలో కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఆయన చిట్వేలుకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. మృత దేహాన్ని కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హార్డ్‌వేర్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ. 30 లక్షలు నష్టం ● ఆందోళనతో యజమాని ఆస్పత్రి పాలు


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రైల్వేకోడూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న వెంకటరమణ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ దుకా ణంలో మంగళవారం తెల్లవారుజాము న మంటలు చెలరేగి రూ. 30 లక్షలు నష్టం వాటిల్లినట్లు యజమాని చెన్నం శెట్టి వెంకటరమణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం రాత్రి దు కాణం కట్టేసి ఇంటికి వెళ్లిపోయారు. తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కార ణంగా మంటలు భారీ ఎత్తున మంట లు చెలరేగడం గమనించిన చుట్టుపక్కల వారు దుకాణ యజమానికి స మాచారం అందించారు. దీంతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న యజమాని దుకాణం కాలిపోతున్న దృశ్యాన్ని చూసి ఆందోళనకు గురై ఆస్పత్రి పాలయ్యాడు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు పక్క దుకాణాలకు అంటుకోకుండా చర్యలు తీసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

కురబలకోట, జూలై 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ నెల 5న కురబలకోట రైల్వే గేటు సమీపంలో బొలెరో -ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దమండ్యం మండలం ముసలికుంట పంచాయతీ దట్టేనాయక్ తాండాకు చెందిన బాలాజీ నాయక్ (30) తిరుపతి రమాదేవి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపా. అలాగే అంగళ్లుకు చెందిన గణేష్, నాగవేణి దంపతుల కుమారుడు రెడ్డెప్పచారి(21) ఈ నెల 4న ఇంట్లో సిగరెట్ తాగుతుండగా తల్లి దండ్రులు చూసి మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను కూడా తిరుపతి రుయాలో చికిత్స పొంతుతూ మృతి చెందాడు.

గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని ఫిర్యాదు

రైల్వేకోడూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని శెట్టిగుంట గ్రామానికి చెందిన షేక్ హాజీబాషా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు బాలపల్లిలోని తన నివాసంలో నిద్రిస్తుండగా గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు చొక్కా పట్టుకుని వాహనంలోకి బలవంతంగా ఎక్కించి దాడి చేశారని తెలిపారు. అనంతరం శెట్టి గుంట వద్ద ఉన్న మర్రిచెట్టు వద్ద వదిలేసి వెళ్లిపోయినట్లు బాధితుడు తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

గణపతి విగ్రహం ధ్వంసంపై కేసు నమోదు

కలికిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గుండ్లూరులో గ్రామంలో అతి పురాతనమైన వినాయకుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై ఎట్టకేలకు మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విగ్రహాన్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయడానికి ప్రయత్నించడంపై సోమవారం స్థానికులు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకుండా పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించారు. ఈ విషయంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో సమగ్ర కథనం ప్రచురితమైంది. కలికిరి పోలీసు ఇన్‌స్పెక్టరు రెడ్డిశేఖర్ రెడ్డి సెలవులో వెళ్లడంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏఎస్‌ఐ జోసెఫ్ మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

'సూర్యఘర్' అమలుకు బ్యాంకులు సహకరించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం అమలుకు బ్యాంకులు సహకరించాలని, జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా జన్‌ధన్ యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్ని బ్యాంకుల అధికారులను, జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధ్యక్షతన లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రత్యేక జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు జరగబోయే ఆర్థిక ప్రచార కార్యక్రమాలను జిల్లా పంచాయతీ శాఖ అధికారితో సమన్వయం చేసుకొని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక క్యాంపుల ద్వారా ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలు ప్రజలందరికీ తెలియజేసేలా చర్యలు తీసుకొని ఆర్థిక సమ్మిళితత్వాన్ని సాధించాలన్నారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన పథకంలో తెరచిన, వాడుకలో లేని అకౌంట్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కోసం పంటల బీమా, ఎస్‌హెచ్‌జీ రుణాలు, ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పై అవగాహన కల్పించాలన్నారు. పంటల బీమా పథకాలను రైతులందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, కోటిరెడ్డి స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఏపీజీబీ విజయవిహారి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రమా.. చెత్త కుప్పా? : డీపీవో


డంపింగ్ యార్డులో అధికారులతో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

సుండుపల్లె, జూలై 8(ఆంధ్రజ్యోతి): రహదారులపై చెత్త కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తోంది, పంచాయతీ సెక్రటరీలు, కార్మికులు ఉన్నారా లేదా అని డీపీవో రాధమ్మ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం సుండుపల్లెకు సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ నిల్వ ఉంచడం, నిప్పు పెట్టడం ప్రమాదకరమన్నారు. పందుల బెడద అధికంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో పందులు పెంచుతున్న వారికి నోటీసులు ఇచ్చి మూడు రోజుల్లో మండల కేంద్రం నుంచి పందులను బయటకి తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 23 మంది పంచాయతీ సహాయకులున్నా మండల కేంద్రంలో చెత్త కుప్పలు దర్శనం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసుకున్న అంగళ్లను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. మురుగు కాలువలు శుభ్రం చేయకపోతే దోమలు అధికమయ్యే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు.

పారిశుధ్యంపైన ప్రత్యేక శ్రద్ధ వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామా జగదీశ్, జనసేన సీనియర్ నాయకులు రామశ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర రైతు సంఘం నాయకులు సుబ్బరామరాజు, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 36 అమలు చేయాలని అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 అమలు చేయాలంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ కార్మికులకు కూడా పారిశుధ్య కార్మికులతో సమానంగా రూ.21 వేల వేతనం ఇవ్వాలని, వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచి పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సంక్షేమ పథకాలు కార్మికులందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, రక్షణ పరికరాలతో పాటు, నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికుల ధర్నాకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు టీవీ రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు దేవా, రమేశ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకం

● డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనరసయ్య

రాయచోటిటౌన్, జూలై8(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో ముఖ్యమైన సూచికల లక్ష్యసాధనలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమైనదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్తహీనతను ఎలా అధిగమించాలి, కుటుంబ నియంత్రణ పద్ధతులు, ఈ ఆశ యాప్ నిర్వహించడంపై అవగాహన కల్పించారు. గత నెలలో నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు, సికిల్ సెల్ అనీమియా డే, మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను ప్రస్తావించారు. ఈనెల డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం నిర్వహించాలని, ఆశ కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి ప్రగతిని సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ రియాజ్ బేగ్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, యూపీహెచ్‌సీల వైద్యులు, డీఎంవో రామ చంద్రారెడ్డి, డిప్యూటీ హెచ్‌ఈవో బలరామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వలపు వల.. చిక్కితే విలవిల

వీడియో కాల్స్ వస్తే...
తెలియని నెంబర్ల నుంచి మనకు వీడియో కాల్స్ వస్తున్నట్లయితే.. ఫోను ఎత్తిన వెంటనే మన ముఖం చూపించకుండా వారిని గమ నించాలి. మన ఫేస్ చూపించినట్లయితే మన ఫొటోలు, డేటాను సేకరించి.. ఆ ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడ తామంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు దోచుకుంటారు.

న్యూడ్ వీడియోస్‌తో రెచ్చగొడతారు
మాయలో పడితే మీ ఖాతాలో డబ్బులు ఖాళీనే..

కడప క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మగాడి వీక్‌నెస్సే వారికి ఆయుధం. తియ్యటి మాటలతో పలకరిస్తారు. ఆపై న్యూడ్ వీడియోలతో రెచ్చగొడతారు. వీరి మాయలో పడితే మాత్రం మీ ఖాతాలోని డబ్బులను ఖాళీ చేసేస్తారు. సైబర్ నేరగాళ్లు మేట్రిమోని, ఫ్రెండ్ యాప్, వివాహాలకు సంబంధించిన వచ్చే వెబ్‌సైట్‌లను కొంత మంది నమ్మి క్లిక్ చేయడంతో పాటు వ్యక్తిగత వివరాలు వారికి చెప్పడంతో వారు మొదట వీడియో కాల్స్ చేస్తారు. అలా ఒకరికొకరు బాగా మాట్లాడిన తరువాత ఇరువురు దుస్తులు లేకుండా మాట్లాడుకునేలా చేస్తారు. కట్ చేస్తే.. ఆపై వరుసగా సైబర్ నేరగాళ్ల నుంచి కాల్స్ వస్తూ వీరి ఫొటోలు మార్ఫింగ్‌లతో మన మొబైల్‌లోని కాంటాక్ట్ నెంబర్లకు పోస్టింగులు పెడతామని.. సోషల్ మీడియాలో వీడియోస్ వైరల్ చేస్తామంటూ బ్లాక్‌మెయిల్‌కు దిగి అందిన కాడికి డబ్బులు దోచుకుంటున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులు, విద్యావంతులే టార్గెట్

ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని యాప్స్ డౌన్‌లోడ్ చేసుకున్నవారికి సైబర్ నేరగాళ్లు వల వేస్తారు. మెసేజ్‌లు, ఈమెయిల్స్ పంపుతారు. ఫోనులో హాయ్ అంటూ అమ్మాయిలు పలుకరిస్తారు. మీతో మాట్లాడాలంటూ మాటలు కలుపుతారు. చాట్ చేస్తారు.. తరువాత ఆ మొబైల్‌ను హ్యాక్ చేస్తారు. ఫేస్‌బుక్ కానీ, వాట్సప్ లలో కానీ అశ్లీలంగా ఉన్న ఫొటోలు పంపుతారు. ఇక అప్పటి నుంచి ఆ ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు పాల్పడుతూ వస్తారు. వీడియోలు బయటికి వస్తే ఎక్కడ తమ పరువు పోతుం దేమోనని భయంతో వారు అడిగిన మొత్తం చాలా మంది చెల్లించు కుంటున్నారు. ఇలా మోసపోయేవాళ్లను మరింత బెదిరిస్తారు. దీంతో చేసేది లేక కొందరు అప్పులు చేసి మరీ వీరికి డబ్బులు ఇచ్చే పరిస్థితి. ముఖ్యంగా ఫేక్ వెబ్‌సైట్‌లు డౌన్‌లోడ్ చేయడం ఎంత ప్రమాదకరమో అనే విషయం సెల్ ఫోను వాడే ప్రతి ఒక్కరూ తెలుసుకుంటేనే మంచిది. ముఖ్యంగా పెళ్లి సంబంధాల కోసం సోషల్ మీడియాను ఆశ్రయిం చేవారి పట్ల సైబర్ నేరగాళ్ల నిఘా ఉంటుంది. అజాగ్రత్తగా ఉంటే డబ్బులు పోవడంతో పాటు మన పరువు ప్రతిష్టలు సైతం పోవాల్సిందే.



జిల్లాలో ఇటీవల మోసపోయిన బాధితులు

జిల్లా వ్యాప్తంగా ఈ ఐదు నెలల్లోనే ఇలాంటి ఫిర్యాదులు దాదాపు పది వర కు పోలీసులకు అందాయి. దాదాపు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల మేర బాధితులు పోగొట్టుకున్నట్లు తెలుస్తుంది.

- ప్రొద్దుటూరుకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగి మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. అంతలోనే ఓ మహిళ ఆయనకు వీడియో కాల్ ద్వారా ఫోను చేసింది. ఫోను ఎత్తిన తరువాత అతని ఫొటోను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతా మంటూ బెదిరింపులకు పాల్పడి దాదాపు రూ.4లక్షలు గుంజేశారు.
- కడపకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఓ వెబ్‌సైట్‌లోకి వెళ్లి యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ ఉద్యోగికి ఒక వీడియో కాల్ రావడంతో స్పందించిన అతన్ని తరువాత బ్లాక్‌మెయిల్ చేయడంతో రూ.3.50 లక్షలు సైబర్ నేరగాళ్లకు చెల్లించాల్సి వచ్చింది.
- కమలాపురానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఫోను చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతుండడంతో దాదాపు రూ.60వేలు వరకు పోగొట్టుకున్నారు. వీరు మార్ఫింగ్ ఫోటోల కారణంగా సైబర్ నేరగాళ్లు బెదిరిస్తే వారి మాటలకు బెదిరిపోయి అడిగినంత డబ్బులు ఇచ్చేస్తున్నారు. వీరి దగ్గర లేకపోయినా మరీ అప్పు తెచ్చి కడుతున్నారు. ఇలా కడుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు వీరిని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతూనే ఉంటారు. చివరికి సైబర్ నేరగాళ్ల బ్లాక్‌మెయిల్ తట్టుకోలేక పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలాంటి అన్‌నౌన్ నెంబరు నుంచి వీడియోకాల్స్ చేస్తే అప్రమత్తంగా ఉండ డంతో పాటు అదే సమయంలో సంబంధిత పోలీసులకు సమా చారం అందిస్తే... చాలా వరకు ఇలాంటి నేరాలు జరగకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

భారీ స్కోరు దిశగా కడప జట్టు



ప్రణీల్‌రెడ్డి, సుదర్శన్, రోహిత్‌వర్మ, సాయిగణేశ్

కడప స్పోర్ట్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 19 మెన్స్ మూడురోజుల క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా మంగళవారం స్థానిక రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప- అనంతపురం జట్లమధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో టాస్ నెగ్గిన కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌కు బ్యాటింగ్ ఎంచుకుని మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 461 పరుగులు భారీ స్కోరు సాధించింది. ఇందులో ఆర్.ప్రణీల్‌కుమార్‌రెడ్డి 108 (138 బంతులు), అలాగే టి.సుదర్శన్ 114 పరుగులు (109 బంతులు), రోహిత్‌వర్మ 85 పరుగులు, అర్జిత్ రెడ్డి 70 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్లు నవదీప్, వీరారెడ్డి చెరీ మూడు వికెట్లు తీశారు.

కేవోఆర్‌ఎం మైదానంలో....

నగర శివారు ప్రాంత కేవోఆర్‌ఎం క్రికెట్ మైదానంలో కర్నూలు-చిత్తూరు జట్లమధ్య మరో మ్యాచ్ మంగళవారం జరిగింది. ఇందులో టాస్ నెగ్గిన కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగి 77.4 ఓవర్లలో 282 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో సాయి గణేశ్ 98 పరుగులు, భార్గవ్ 54 పరుగులు సాధించారు. బౌలింగ్ విభాగంలో చిత్తూరు జట్టు బౌలర్లు సాయి చరణ్ 4 వికెట్లు, కశ్యప్‌గని 2 వికెట్లు, సిరాజ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి నాలుగు ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 11 పరుగులు సాధించింది.

సింహాద్రిపురం, జమ్మలమడుగు మార్కెట్ కమిటీ పాలకవర్గాల నియామకం

కలికిరి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వ్యవసాయ మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం ఏఎంసీకి హోదా రీత్యా ఎమ్మెల్యే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవాధ్యక్షులుగా, చైర్మన్‌గా బండి సూరారెడ్డి, వైస్ చైర్మన్‌గా వి.ఓబులేశును, 13 మంది సభ్యులను నియమించారు. వీరు కాకుండా అంకాలమ్మ గూడూరు సింగిల్ విండ్ పర్సన్ ఇన్‌చార్జి, పశుసంవర్ధక శాఖ సింహాద్రిపురం ఏడీని, సింహాద్రిపురం సర్పంచును, మార్కెటింగ్ శాఖ జిల్లా డీఏటీని కూడా నామినేట్ చేశారు.

ఇక జమ్మలమడుగు మార్కెట్ కమిటీకి గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, చైర్మన్‌గా సింగంరెడ్డి నాగేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్‌గా తుమ్మలూరు మల్లికార్జునను నియమించారు. సభ్యులుగా 12 మందిని నియమించారు. ప్రొద్దుటూరు సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జిని, ప్రొద్దుటూరు వ్యవసాయ శాఖ ఏడీని, జమ్మలమడుగు నగరపంచాయతీ ప్రత్యేక అధికారిని, జిల్లా మార్కెటింగ్ శాఖ డీఏటీని నియమించారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఎక్-అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పూల విక్రయ హక్కు బహిరంగ వేలం వాయిదా

చక్రాయపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరగనున్న శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా మంగళవారం పలు వాటికి అధికారులు బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు నిర్వహించారు. వీటిలో పూల విక్రయం, షాపింగ్ కాంప్లెక్స్, ప్రత్యేక పుష్పాలంకరణ హక్కునకు సంబంధించి బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు వాయిదా చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. వీటికి 16వ తేదీ ఇ-టెండర్/సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే విద్యుత్ దీపాలంకరణ కోసం సీల్డ్ టెండర్ బాక్స్ తెరువగా మూడు కొటేషన్లు వచ్చాయన్నారు. అందులో మణికంఠరెడ్డి రూ.2,77,650కు మిగిలిన ఇద్దరి కంటే తక్కువ మొత్తంకు కోట్ చేయడం జరిగిందన్నారు. అలాగే పందిర్లు, బారికేడ్స్ ఏర్పాటుకు సంబంధించి మూడు కొటేషన్లు రాగా డి.జగదీశ్వర్‌రెడ్డి మిగిలిన ఇద్దరి కంటే తక్కువ మొత్తానికి కోడ్ చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, చైర్మన్ కృష్ణతేజ, మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి, అర్చకులు, అధికారులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తున్న చంద్రబాబు : మంత్రి సవిత

చెన్నూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా చెన్నూరు బెస్త కాలనీలో ఆమె ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కాలనీలోని మత్స్యకారులు వారికి స్వాగతం పలికి చేపలను బహూకరించడంతో సంతోషం వ్యక్తం చేసి వాటిని ప్రదర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టడం తప్ప చేసిందేమీ లేదన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే చెన్నూరు మండలంలో రూ.10కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కేసీ కెనాల్‌లో నీరు సక్రమంగా పారేలా పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ ఏడాది పాలనలో ఊరూరుకి ఎంతో చేశామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రతి గ్రామంలో సమస్యలు తీర్చి ప్రజల్లోకి వెళతామన్నారు. గత ప్రభుత్వం ఉన్న కంపెనీలను పారిపోయేలా చేస్తే చంద్రబాబు పాలనలో వెళ్లిపోయిన కంపెనీలను రప్పించడంతో పాటు కొత్త కంపెనీలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బెస్తకార సాధికార కమిటీ సభ్యుడు మల్లె చిన్నసుబ్బయ్య మత్స్యకారుల సమస్యలపై మంత్రికి విన్నవించారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. బీసీ నేత గుగ్గిళ్ల చాణక్య చేనేతల సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం ఇచ్చారు. కొండపేట మాజీ సర్పంచ్ మన్యం మోహన్‌రెడ్డి పాఠశాల స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, వైస్‌చైర్మన్ ఆకుల చలపతి, టీడీపీ నేతలు పాలగిరి పెద్దసుబ్బారెడ్డి, ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, వేల్పుల సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బారెడ్డి, బడి గింజల మురళి, గుగ్గిళ్ల చాణుక్య, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



చెన్నూరు బెస్తకాలనీలో మత్స్యకారులు బహూకరించిన చేపలను చూపుతున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

నేడు క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపికలు

కడప స్పోర్ట్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీపంలో గల వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5, తరగతుల ప్రవేశానికి ఈనెల 9, 11, తేదీలలో జిల్లాస్థాయి ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్నాథరెడ్డి వెల్లడించారు. 9వ తేదీ బుధవారం 4వ తరగతి ప్రవేశానికి, 11వ తేదీ శుక్రవారం 5వ తరగతి ప్రవేశానికై జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్‌డీఓ) స్టేడియంలో జరుగనున్నాయన్నారు. ఎంపికలకు హాజరయ్యే ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు సెట్స్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. ప్రాథమికస్థాయి వైద్య పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయి ఎంపికలలో పాల్గొనేందుకు అర్హులన్నారు.

శాసన నైపుణ్యం పెంపొందించుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): న్యాయసేవాధికార సంస్థ పరిధిలో పనిచేసే లీగల్, ప్యానల్ అడ్వకేట్స్ శాసన పరిజ్ఞానంపై నైపుణ్యాన్ని పెంపొందించుకుని తద్వారా న్యాయ విషయాలను ప్రజలకు పరిచయం చేసి సమాజాభివృద్ధికి పాటుపడాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాపక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో ప్యానల్ అడ్వకేట్స్‌కు శాసన నైపుణ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయ విషయాలను ప్రజా న్యాయపీఠం ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. న్యాయ వ్యవస్థ, చట్టాలపై అవగాహన కలిగి ఉండడం వలన ప్రజల అభివృద్ధితో పాటు, సమాజ శ్రేయసుకు ఎంతగానో దోహద పడుతుందన్నారు. అలాగే నల్సా పథకాలపై న్యాయసేవల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, న్యాయసేవల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

వీరపునాయునిపల్లె / వేముల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మినుము పంట సాగులో సస్యరక్షణచర్యలు చేపట్టాలని ఏవో శ్యామ్‌బాబు తెలిపారు. మండలంలోని గోనుమాకుల పల్లె గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుముపంటను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ మినుము పంటలో రసం పీల్చే పురుగు ఉధృతిని అదుపులో ఉంచేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అలాగే వేముల మండలంలోని శేషన్నగారిపల్లె, బెస్తవారిపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ లో సాగుచేసిన పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు



గంజాయి విక్రయదారుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

ప్రొద్దుటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ డీమార్ట్ సర్కిల్లో ఆరుగురు గంజాయి విక్రయదారులను మంగళవారం అరెస్టు చేసిన ట్లు ఎక్సైజ్ సీఐ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. వీరి వద్ద నుంచి 2400 గ్రాముల గంజాయితో పాటు ఒక టూవీలర్ ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కె.నాగేంద్ర, పి.బాబు, డి.గురుతేజరెడ్డి, బి.మోహన్, లాల్‌నాయక్, జగ దీష్ చదువులు మధ్యలో ఆపేసి చెడు స్నేహాల ప్రభావంతో గంజాయి తాగడం, అమ్మకాలు చేయడానికి అలవాటు పడి నట్లు తెలిపారు. ప్రొద్దుటూరులో పలు కాలేజీలో చదివే విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని గంజాయిని పొట్లాల రూపంలో విక్రయాలు సాగించేవారని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసు దాడులు

జమ్మలమడుగు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ఈడిగపేట బుర్జు సమీపంలో మంగళవారం వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించారు. రాబడిన సమాచారం మేరకు ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, పోలీసులతో కలిసి దాడులు నిర్వహించినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. వ్యభిచార గృహంపై దాడి చేసి ఆ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళతోపాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు పట్టణంలో, గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామమన్నారు. అలాగే పట్టణంలో ఎవరైనా మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే బాధితులు స్టేషన్‌కు సమాచారం ఇస్తే.. అల్లరి మూకలను అరెస్టు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి భూముల కౌలు వేలం

చిన్నమండెం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ మాండవ్యనది ఒడ్డున వెలసిన మండెం లక్ష్మీనరసింహస్వామి భూములకు నేటి ఉదయం 10 గంటలకు కౌలు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో కొండారెడ్డి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కాలపరిమితికి ఈ భూముల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. పాల్గొనే వారు రూ.వెయ్యి ధరావత్తు కింద చెల్లించాలని, వేలం దక్కించుకున్న వెంటనే మొత్తం చెల్లించాలన్నారు.

అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం..

- పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న బీటెక్ రవి

వేంపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తాం, ధైర్యంగా ఉండాలని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి బాలిక కుటుంబానికి ధైర్యం చెప్పారు. వేంపల్లె మండలం పక్కీరుపల్లెకు చెందిన సయ్యద్ సుమియ అదృశ్యమై రాత్రి అడవిలో ఆచూకీ లభించిన విషయం తెలిసింది.

కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను మంగళవారం బీటెక్ రవి పరామర్శించారు. తప్పుచేసిన యువకులను కఠినంగా శిక్ష పడేలా చేస్తామని భరోసా ఇచ్చారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్‌పై అల్లరిమూకలు దాడి చేయడం మంచిది కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్ తదితరలు పాల్గొన్నారు.

కేసీ ప్రధాన కాలువలో గోడ నిర్మాణం

- పెండింగ్ పనుల పూర్తికి చర్యలు



దువ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం రిజర్వాయర్ నీటితో నిండడం.. దిగువనున్న ప్రాజెక్టులకు సాగు, తాగునీరు వదులుతుండడంతో అధికారుల్లో చలనం మొదలైంది. కేసీ ప్రధాన కాలువలో నెలకొన్న అరకొర పెండింగ్ పనులపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా దువ్వూరు మండలం ఇడమడక సమీపంలోని 244.200 కి.మీ. వద్ద పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడ వక్కిలేరు అక్విడెక్ వద్ద కేసీ ప్రధాన కాలువలో కిందటి సంవత్సరం రిటైనింగ్‌వాల్ దెబ్బతింది. గండిపడుతున్న నేపథ్యంలో అప్పట్లో ఇసుక బ్యాగులతో తాత్కాలిక మరమ్మతులు చేశారు. అప్పట్లోనే నిధులు మంజూరైనా పనులు చేపట్టలేదు. ప్రస్తుతం కేసీ అధికారులు చొరవ తీసుకుని కాంట్రాక్టర్‌ను పనులు చేసేందుకు పురమాయించారు. పనులు చేయిస్తున్న ఇడమడక ఏఈ జమాల్‌వల్లి మాట్లాడుతూ రూ.9.5 లక్షల నిధులతో ఈ పని చేస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల్లో పని పూర్తవుతుందన్నారు. తూముల్లో పాడైన షెట్టర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పరిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏఈ వివరించారు.

ఇడమడక వద్ద కేసీ కాలువలో జరుగుతున్న రిటైనింగ్‌వాల్ నిర్మాణం

ఇన్‌చార్జి మంత్రిని కలిసిన వికాస్ హరికృష్ణ



ఇన్‌చార్జి మంత్రి సవితను సత్కరిస్తున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమ, చేనేత, జౌళీశాఖ మంత్రి ఎస్.సవితను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ మర్యాద పూర్వకంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం వికాస్ హరికృష్ణ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వాటిపై సానుకూలంగా స్పందించినట్లు హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గ్రీసెంట్ జిలాని బాష తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు న్యాయం చేయండి'

కడప సెవెన్ రోడ్స్,జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దళితులకు కేటాయించిన భూమి కోసం కడప ఆర్డీఓ కార్యాలయం వద్ద 24 రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్న వారి సమస్యను పరిష్కరించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి కోరారు. మంగళవారం మంగళగిరి ల్యాండ్ సర్వే హెడ్ ఆఫీస్‌లోని డైరెక్టర్ నక్కల ప్రభాకర్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటేశ్,పాత కడప దళితులు ఓబులేసు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం నిండా పెరిగిన కంపచెట్లు

శవాలను పూడ్చుకోవడానికి ఇబ్బందులు ● కంపచెట్లు తొలగిస్తేనే ఉపయోగం



చెన్నూరు మోడాల శ్మశానంలో పెరిగిన కంపచెట్లు

చెన్నూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోడాల ఎదురుగా ఉన్న శ్మశానంలో కొన్నేళ్లుగా కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. వీటిని తొలగించకపోవడంతో ప్రజలు ఎవరైనా మృతదేహాలను తీసుకెళ్లినప్పుడు అక్కడ ఖననం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురైంది. చాలా ఏళ్ల క్రితం దాదాపు 2 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ శ్మశానం ఉంది. అయితే ఈశ్మశానాన్ని శుభ్రం చేయాలంటే కడప కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. చిన్నమాచుపల్లె వరకు కార్పొరేషన్ పరిధిలోకి ఉండడం, రెవెన్యూ పరంగా చూస్తే అది చెన్నూరు మండలానికి చెందినా కార్పొరేషన్ పరిధిలోకి ఈ చిన్నమాచుపల్లెను 49వ వార్డుగా విలీనం చేయడంతో ప్రజలు అభివృద్ధికి కాస్త ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఉపాధి హామీలో కంపచెట్లు తొలగించాలంటే కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో పనులు చేపట్టేందుకు అవకాశం లేదు. అలాకాకుండా రెవెన్యూ పరిధిలోకి తీసుకుని పనులు చేపట్టాలంటే కంపచెట్లు తొలగిస్తే బిల్లులువచ్చే అవకాశం ఉపాధి హామీ పథకంలో లేదు. అటుఇటు కాని పరిస్థితుల్లో ప్రజలకు శవాలు పూడ్చుకునేందుకు కొన్నేళ్లుగా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి ఏదోక విధంగా కంపచెట్లు తొలగిస్తే ఈ శ్మశానం ఉపయోగపడుతుందని ప్రజలు కోరుతున్నారు. పైగా శ్మశానంలో విపరీతంగా కంపచెట్లు పెరగడంతో మృతదేహాలు తీసుకెళ్లాలన్నా వెళ్లలేని పరిస్థితి. మరో వైపు ప్రహరీ లేకపోవడంతో పాములు సంచరిస్తున్నాయని ప్రజలు భయం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేషను, రెవెన్యూ తమ విధానం పక్కనబెట్టి ప్రజలకు ఉపయోగపడేలా కంపచెట్లు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పంటల బీమాకు 31 చివరితేదీ

సీకేదిన్నె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాకు ఈనెల 31 వరకు చెల్లించవచ్చని ఏవో ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కె.ఓబుళంపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వాతావరణ ఆధారిత బీమాలో పత్తికి రూ.2 వేలు, వేరుశనగకు రూ.560, బత్తాయికి రూ.2,750, అరటికి రూ.3,025 ఎకరాకు పై మొత్తం జూలై 15 వరకు గడువు ఉందన్నారు. వరికి రూ.84, కందికి రూ.36, జొన్నకు రూ.38, మినుముకు రూ.38, పసుపుకు రూ.180, ఉల్లికి రూ.90 చొప్పున జూలై 31 వరకు చెల్లించవచ్చన్నారు. వరికి మాత్రం ఆగస్టు 15 వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని రైతులు ఈ మూడు రకాలుగా ప్రీమియం చెల్లించాలన్నారు.

పులివెందుల రూరల్...: ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏవో చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని చిన్నరంగాపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే కందులు మినీ కిట్లు కావాల్సిన రైతులు రైతు సేవా సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, సిబ్బందిపాల్గొన్నారు.

In the Court of the Hon'Ble Principal Senior Civil Judge, Kadapa.
I.P. No. 28/2025

Between
Chinnathota Padmakar S/o C. Babu Rao, aged 40 years, Hindu, Business, Residence, D.No. 1/705-A, Ashok Nagar, Chinna Chowk, Kadapa City, YSR Kadapa District (Aadhar No. 575837369963), Cell No. : 9703074536, e-mail id:padduc19@gmail.com ... **Petitioner(Debtor)**
And
1) **Ramabhagavathulla Mahesh** S/o R. Sankara Sastry, aged 33 years, Hindu, R/D.No. 1/100, Nadimpalli Village, Rompicherla Mandal, Pin Code : 517192, Chittoor District (Aadhar No.45813153871), Cell No.8074822142, 8897684277 E-mail id: ramabhavathullamahesh@gmail. com
2) **Vankadhara Narendra Rao** S/o V. Madhava Rao, aged 42 years, Hindu, Business, Residence D.No. YMR Colony, Proddatur Town & Mandal, YSR Kadapa District Cell No. 9059825531 E-mail id: narendravankadhara@gmail. com
3) **Poola Siddeswara Rao** S/o P. Siddhaiah, aged 45 years, Hindu, Business, Residence D.No. 5/513, Ravindra Nagar, Kadapa City, YSR District Cell No. 9985570358 E-mail id: poolasiddeswara@gmail. com
4) **Uppalapati Siva** S/o U. Ramana, aged 34 years, Hindu, Business, RD.No. 3/100g, Rajareddy Street, Kadapa City, YSR Dist. Cell 7799850511 E-mail id: sivazz@gmail. com
5) **Bhayasani Siva Pradeep** S/o Tirupal, aged 42 years, Hindu, Srinidhi Mobiles, Opp. Petrol Bunk, Near Bata Showroom, Old Bus-Stand, R D.No. 42/593-3, NGO Colony, Kadapa City, YSR District Cell No. 9959515055 E-mail id: bayasanisiva@gmail. com
6) **Jakkala Ramachandraiah** S/o Venkateswarlu, aged 32 years, Hindu, Business,Road No.2, Vidyuth Nagar, Kadapa City, YSR District Cell No. 9398469460 E-mail id: bayasanisiva@gmail.com ... **Respondents (Creditors)**

GENERAL NOTICE

That the above Petitioner have filed the Insolvency Petitions against you declaring him as Insolvent and the said I.P. No. 28/2025 is posted to 10-07-2025 your appearance. Thus you have to appear before the said Hon'ble Court 10-07-2025 at 10.30 AM either personally or through your counsel and raise objections. If any the claim of Petitioner, otherwise it will be heard and decided in absence.

//BY ORDER OF THE COURT//
MOGALI NAGARAJU, M.Sc., B.L.
Advocate & Notary, Kadapa. Cell : 502813980,
E-mail id: mogalinagaraju25@gmail.com

రేపు సామూహిక సత్య నారాయణస్వామివ్రతం

కడప మారుతీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా 10న గురువారం ఉదయం 7.30గంటల నుంచి నగర గడ్డిబజారులో (బాలాజీగుడి) వెలసిన లక్ష్మీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం జరగనున్నట్లు ఆ ఆలయ అర్చకుడు కళ్యాణపురం విజయభట్టర్ తెలిపారు. భక్తులు వ్రతంలో పాల్గొనేందుకు సాంప్రదాయ వస్త్రాలు ధరించి రావాలని కోరారు.

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం

కడప క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తు చిన్నాభిన్నం చేసుకోవద్దనిప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారుబాటలు వేసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్ లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళవారం యాంటి డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏడీ డిసబిలిటీ క్రిష్ణకిశోర్, రిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభాస్కర్, అసిస్టెంట్ ప్రొఫెసరు వంశీక్రిష్ణ, రిమ్స్ వైద్య అధ్యాపకులు,వైద్యవిద్యార్థులు,ఈగల్‌సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం - బీటెక్ రవి



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బీటెక్ రవి

పులివెందుల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే పథకాలు ప్రతిఒక్కరికీ అందిస్తామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పేర్కొన్నారు. మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమం బాకరాపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, ఉచిత గ్యాస్, పింఛన్ పెంపు తదితర పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తూగుట్ల సిద్దారెడ్డి, తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

సైనికుల సంక్షేమానికి అవిరళ కృషి

కడప మారుతీనగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సైనికుల, మాజీ సైనికుల సంక్షేమానికి అవిరళ కృషి చేస్తామని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి వి.భక్తవత్సలరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక సింహపురికాలనీలో ఉన్న సైనిక్‌భవన్‌లో నూతనంగా జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన భక్తవత్సలరెడ్డికి ది కడప డిస్ట్రిక్ట్ ఎక్స్‌సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ రావు ఆధ్వర్యంలో ఆయనకు ఘన సత్కారంగావించారు. అలాగే ఇదివరకటి జిల్లా సైనిక సంక్షేమ శాఖ జిల్లా అధికారిగా ఉన్న ఎండీ రజాక్‌ఖాన్ చిత్తూరుకు బదిలీపై వెళుతున్న నేపధ్యంలో ఆయనను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్‌ప్రెసిడెంటు పుల్లయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి గోవర్ధనరెడ్డి, ట్రెజరర్ ఓబులేసు, గౌరవాధ్యక్షుడు శివశంకర్‌రావు, కో-ఆర్డినేటరు రమేశ్, బలరాం, విజయలక్ష్మి తదతరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడప విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం లో మంగళవారం రాహుకేతు పూజలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి వేకువజామున పంచామృతాభిషేక, అనంతరం అమ్మవారిని చక్కగా అలంకరించి దర్శనానికి అందించారు. అనంతరం మధ్యాహ్నం 3 నుండి 4.30 వరకు అర్చకులు రాహుకాల పూజలు చేశారు. ఆషాఢ పౌర్ణమి రోజు అందరూ విజయదుర్గాదేవిని దర్శించుకుని అమ్మ ఆశీస్సులు పొందాలని ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు , నిర్వాహకుడు దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 13న ఆదివారం విజయదుర్గా, మల్లికార్జునస్వామి వారి కల్యాణం జరగనుందని అర్చకులు తెలిపారు.


మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి



కోటిరెడ్డి సర్కిల్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

కడప సెవెన్ రోడ్స్,జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను చిన్నచూపు చూస్తూ, పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచి ఇంజనీరింగ్ కార్మికులకు పెంచకపోవడం చాలా దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామమోహన్ అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు తల్లికివందనం అమలు చేయకపోవడం కార్మికులకు అన్యాయం చేయడమే అన్నారు. ఈ మేరకు కోటిరెడ్డి సర్కిల్ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొని, 12వ తేదీ అర్ధరాత్రి నుంచి కడపనగరంలో నీళ్లు,వీధి దీపాలతో పాటు మొత్తం కార్పొరేషన్ సేవలు అన్ని బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మనోహర్, నాయకులు పీవీ సుబ్బయ్య,చంద్రారెడ్డి, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్,కార్మికులు పాల్గొన్నారు.

ఎన్నికల జాబితా సవరించడంలో బీఎల్వోల పాత్ర కీలకం



శిక్షణ ఇస్తున్న మహేశ్వర్‌రెడ్డి

పులివెందుల రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల జాబితాను సవరించే ప్రక్రియ లో బీఎల్వోల పాత్ర కీలకంగా ఉంటుందని మాస్టర్ ట్రైనర్ బి.మహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణం లోని ఆర్డీఓ కార్యాలయంలో తాలూకాలోని 301 పోలింగ్ బూత్‌లకు ఎంపిక చేసిన బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్ఓ) ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ బి.మహేశ్వరరెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం నేర్చుకున్న అంశాలను గూగుల్ ఫామ్ ద్వారా పరీక్ష పెట్టి హాజరైన వారి మార్కులను పై అధికారులకు పంపించినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
కడప ప్రధాన శాఖ, (00830) కడప జిల్లా

SARFAESI చట్టం 2002 సెక్షన్ 13(4)క్రింద ఆస్తి స్వాధీనం కొరకు ప్రచురించిన ప్రకటన

ఖాతా నం.(1) H.L36176824114 (2) రుణరక్ష 36373240408 (3) టాప్ అప్. 39769555202
డి. మురళీమోహన్, తండ్రి సుబ్బన్న, డి.నెం. 31/62-2, శివాలయం ఎదురుగా, దేవుని కడప, కడప జిల్లా.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు ప్రకటన స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా ప్రకటనలో తెలిపిన బకాయి మొత్తం తిరిగి చెల్లించవలసిందిగా డిమాండ్ ప్రకటనను జారీ చేశారు. రుణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, సదరు చట్టంలోని రూల్ 9తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది.
సదరు ఆస్తులతో ఎటువంటి వ్యవహారాలు జరుపరాదని ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తులతో జరిపే ఏ వ్యవహారాలైనా దానిపై వడ్డీ మరియు ఖర్చులు భారతీయ స్టేట్ బ్యాంక్ వారికి చెల్లించుటకు లోబడియుంటాయి.
సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందుటలో ఇంకా సమయం ఉన్నందున చట్టం సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) క్రింద ఉపయోగించుకోగలరని రుణగ్రహీతలను కోరబడుచున్నారు.

1.	**ఖాతా / రుణగ్రహీత పేరు & చిరునామా :** (1) డి. మురళీమోహన్, తండ్రి సుబ్బన్న, డి.నం. 33/62-2, శివాలయం ఎదురుగా, దేవుని కడప, కడప జిల్లా
2.	**ఆస్తి యజమాని పేరు వగైరా :** డి. మురళీమోహన్
3.	**తాకట్టు / చార్జ్ చేయబడిన ఆస్తి వివరణ :** కడప జిల్లా, కడప జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నమోదిత సేల్‌డీడ్ డాక్యుమెంట్ నం. 8160/2001 క్రింద డి. మురళీమోహన్, తండ్రి సుబ్బన్న పేరున గల ప్రస్తుత కడప నగర పాలక సంస్థ, దేవుని కడప, ఉక్కాయిపల్లి గ్రామ పరిధులు, డి.నం. 31/62-2 గల సర్వే నం.లు 505, 506, 507/1, 507/2, 509/1 మరియు 509/2లలో గల ఎ. 0.02 సెంట్ల విస్తీర్ణంలో భూమి, గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు ఆస్తి యావత్తు. **సరిహద్దులు:** తూర్పు: అదే ప్లాట్ నం.లో మిగిలిన స్థలం, పశ్చిమం: డి. వెంకట సుబ్బయ్య స్థలం, ఉత్తరం: టెలిఫోన్ సుబ్బారావు స్థలం, దక్షిణం: 20 లింకుల వెడల్పు రోడ్. **కొలతలు:** తూర్పు-పశ్చిమం: 20 లింకులు, ఉత్తరం-దక్షిణం: 100 లింకులు.
4.	డిమాండ్ ప్రకటన తేది : 16.04.2025, కానీ సదరు ప్రకటన చేరకుండానే తిరిగి వచ్చినది. అందువలన "సాక్షి & ది హిందూ"లో 05.05.2025న వార్తా పత్రికా ప్రచురణ ద్వారా తెలియజేయడమైనది
5.	స్వాధీనత తేది : 08.07.2025
6.	బకాయి మొత్తం : ఈనాటికి 15.4.2025 రూ. 22,66,776/-

తేది : 08.07.2025
ప్రదేశం : కడప

సం/- అధీకృత అధికారి
భారతీయ స్టేట్ బ్యాంక్
కడప ప్రధాన శాఖ, కడప జిల్లా.

ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోనల్ స్పెషల్ డ్రైవ్

కడప క్రైం, జులై 8 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలలో 100 మీటర్ల దూరంలో సిగరెట్, పొగాకు సంబంధిత ఉత్పత్తులు విక్రయించడం నిషేధించడమైదని ఆపరేషన్ క్యాంపస్ సేఫ్ జోన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం పోలీసు అధికారులు తమ పరిధుల్లోని ఆయాపాఠశాలలు, కళాశాల, విద్యాసంస్థలను సందర్శించి 100 మీటర్ల లోపు టీ షాపులు, పాన్‌షాపులు, కిరాణం షాపుల్లో సిగరెట్లు, ఖైనీ, గుట్కా వంటి పొగాకుఉత్పత్తులు అమ్మడం నిషేధమని షాపు నిర్వాహకులకు తెలిపారు.

పలువురు యువకులు టీడీపీలో చేరిక

పులివెందుల,జూలై 8 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సమక్షంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. మంగళవారం బాకరాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటికి టీడీపీ అనే కార్యక్రమాన్ని బీటెక్ రవి చేపట్టారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతానికి చెందిన పది మంది యువకులు బీటెక్ రవి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

సీకేదిన్నె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని మహిళా పోలీసు స్టేషన్ సీఐ ఇదురుబాష తెలిపారు. స్థానిక ముక్తియార్ విద్యాసంస్థల ప్రాంగణంలో మంగళవారం ఫిజియోథెరఫీ, నర్సింగ్ విద్యార్థులకు ర్యాగింగ్, ఫోక్సో, బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అలీఅక్బర్, ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం

వేంపల్లె, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్ కాలనీలోని అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. కీర్తిశేషులు మునీంద్ర కుమార్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కుటుంబ సభ్యులు మునిరెడ్డి, సుశీలమ్మ, మునికుమారి, చిన్నదస్తగిరిరెడ్డి, మునెమ్మ, గంగాధర్‌రెడ్డి, కృష్ణవేణి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి చేతులమీదుగా అన్నదానం చేశారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

లింగాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు వారి ఆరోగ్యంపై అవాహన కల్పించాలని ఆశావర్కర్లను లింగాల ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్ర వైద్యాధికారి ప్రసన్నకుమార్ ఆదేశించారు. మంగళవారం ఆశావర్కర్లతో పీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతంచేరుకోవాలన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోండి

కడప క్రైం, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కడప సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐ తనను వేధిస్తున్నాడంటూ ఓ బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎస్ఐ తప్పుడు కేసును నమోదు చేయడంతో తాను హైకోర్టును ఆశ్రయించడంతో తనపై బెదిరింపులకు పాల్పడుతున్నారని తనను వేధిస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నట్లు తెలిసింది.

యూరియా వాడకాన్ని తగ్గించాలి

చక్రాయపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విచ్చలవిడిగా యూరియా వాడకాన్ని తగ్గించాలని లేకుంటే దోమ, తెగులు ఉధృతి పెరుగుతుందని ఏవో చంద్రశేఖర్‌రెడ్డి అన్నా రు. మంగళవారం మండలంలోని కె.రాజుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కే, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో 29వ డివిజన్‌లో పర్యటిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

జేఎల్ఎమ్ గ్రేడ్-2 సమస్యలను పరిష్కరించాలి

కడప సెవెన్ రోడ్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జేఎల్ఎమ్ గ్రేడ్-2ల సమస్యల పరిష్కారం కోసం మంగళ వారం కడపలోని పెద్ద పోస్టాఫీస్‌లో చంద్రబాబుకు పోస్టు కార్డు ద్వారా లేక కార్యక్రమాన్ని గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శి కృపాకర్, ఉపాధ్యక్షులు మల్లికార్జున, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ తరగతులు

వల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం, రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ ఆదేశాలమేరకు మంగళవారం ఎంపీడీవో సభాభవనంలో ఎంపీడీవో రఘురామ్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ వీ.శ్రీధర్, కార్యదర్శి ఆర్వీ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ పురోగతి సూచికలోని అంశాలపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ సుమలత, ఎంఈవో-2 విజయారెడ్డి, ఏపీఓ సుధారాణి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకానికి చేయూత

దువ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పూలు, పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని ఇడమడక, నారాయణపల్లె, క్రిష్ణంపల్లె, మూడిండ్లపల్లె గ్రామాల్లో 23 ఎకరాల్లో మల్లె, రోజా మొక్కలతోపాటు మునగ మొక్కలు నాటుతున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య, ఉపాధి అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం



ప్రొద్దుటూరులో మహిళలతో మాట్లాడుతున్న కొండారెడ్డి, రాఘవరెడ్డి



బద్వేలులో ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి



ఎర్రగుంట్ల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న భూపేష్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమం సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కొత్తపల్లె పంచాయతీలోని వివేకానంద నగర్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నారన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలన్ని అమలు చేస్తున్నారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు కూడా వేగవంతంగా సాగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పేర 20 వేల ఆర్థిక సహాయం అందజేయనున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి ,కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతు నాగరాజు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బద్వేలుటౌన్/రూరల్, జులై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకుడు రోశన్నలు పేర్కొన్నారు. మంగళవారం సుపరిపాలనతో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సురేంద్రనగర్, లక్ష్మీపాలెం గ్రామంలో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా, దేశంలో ఎక్కడా లేని విధంగా 4వేల రూపాయల పెన్షన్‌ను 1వ తేదీనే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, నరసింహానాయుడు, శివయ్యస్వామి, ఊట్ల సుబ్బరామయ్య, జీవీ సుబ్బారెడ్డి, మస్తాన్‌బాబు, చెన్నయ్య, రవికుమార్ రెడ్డి, రామచంద్రా రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పీరయ్య, శ్రీను పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చే విధంగా చంద్రబాబు పాలన

ఎర్రగుంట్ల, జూలై 8(ఆంధ్రజ్యోతి): ప్రజలు మెచ్చే విధంగా సీఎం చంద్రబాబునాయుడు పరిపాలన ఉందని జమ్మలమడుగు నియోజవర్గ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల మండలంలోని పి.వెంకటాపురంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బూత్ నెంబరు 251 పరిధిలోని ఇంటింటికి తిరిగి మంచి ప్రభుత్వం ఏడాది కాలంలో అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మండల ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామక్రిష్టారెడ్డి, గోపాల్‌యాదవ్, నాగిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్ర ఓబుళ్‌రెడ్డి, నాగేంద్ర, వీరారెడ్డి, రమణారెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, సత్యనారాయణ, క్లస్టర్, బూత్ కన్వీనర్, కో కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్యం

బద్వేలు,జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందుతోందని తొట్టిగారిపల్లె వైద్యాధికారి వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తచెరువు గ్రామంలో డెంగ్యూ మాసోత్సవంలో కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే, శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాన్పులకు లక్షలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు జనార్ధన్‌రావు, సర్పంచ్ అనూష, సీహెచ్‌ఓ వీణ పాల్గొన్నారు.

బీమా కోసం రైతులు ప్రీమియం చెల్లించాలి

బి.కోడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మండలం పరిధిలోని తుమ్మలపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మాటాడుతూ రైతులు ఖరీఫ్‌లో వేసే పత్తికి రూ.2వేలు, వేరుశెనగ రూ.560, బత్తాయికి రూ.2750, అరటికి రూ.3025 ప్రీమియంను జూలై 15లోపు చెల్లించాలని దిగుబడి ఆధారిత బీమా ఎకరాకు రూ.84, కందికి రూ.36, జొన్నకు రూ.38, మినుము 38 , పసుపుకు రూ.180, ఉల్లికి రూ.90 ప్రీమియం జూలై 31లోపు చెల్లించాలని, వరికి మాత్రం ఆగస్టు 15లోపు చెల్లించాలని, బ్యాంకుల ద్వారా లేదా కామన్ సర్వీసు సెంటరు ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని వివిధ రనకాల పథకాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బ్రహ్మానందరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతికి పాటుపడాలి

బద్వేలు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ పురోగతి సూచికలో పొందుపరిచిన విధంగా అమలు చేయాలని డివిజనల్ అభివృద్ధి అధికారి శేషయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులకు పంచాయతీ పురోగతి సూచికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఆదినారాయణ, పరిపాలన శాఖాధికారి క్రిష్ణశర్మ , మండల పరధిలోని పంచయాతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులు డిజిటల్ సహాయకులు, ఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రగతి బాటలో గ్రామాలను నడిపించాలి

ముద్దనూరు జూలై8(ఆంధ్రజ్యోతి):ప్రగతి బాటలో గ్రామాలను నడిపించేలా కృషి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సభాభవనంలో మంగళవారం పంచాయతీ రాజ్ అచీవ్‌మెంట్ ఇండెక్స్ కార్యక్రమం పై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, డీటీ వరదకిశోర్‌రెడ్డి, ఇన్‌చార్జి పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: గ్రామ పంచాయతీ పురోగతి సాధన ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల స్థాయి పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో నిర్వహించారు. ఈ శిక్షణలో గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, చౌడూరు డిజిటల్ అసిస్టెంట్ జశ్వంత్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎస్ఎం తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో: పంచాయతీలు పురోగతి సాధించాలంటే అధికారుల పాత్ర కీలకమని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచికపై మంగళవారం అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికి ప్రభుత్వ పథకాలు అందరికి అందే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో పురోగతి సూచిక 20 శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంఈవో చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

చాపాడులో: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు అందరు గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో వీరకిశోర్ కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీలో పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారి, ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, సీడీపీవో ముంతాజ్‌బేగం, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అట్లూరులో: మండలంలోని 12 గామ పంచాయతీలపరిధిలో పురోగతిపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అట్లూరు ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు పంచాయతీల పురోగతిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధికారులు సచివాలయ సిబ్బది పాల్గొన్నారు.

26 మందికి సీఎం సహాయనిధి పంపిణీ



దేవగుడిలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో ఎమ్మెల్యే స్వగృహంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 28 మందికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ బాదితులకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇవ్వడం వరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వివిధ సమస్యలతో ఇబ్బంది పడినా బాదిత ప్రజలను ఆదుకున్నారన్నారు. మొత్తం 26 మందికి రూ.13,71,392 విలువచేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కొండయ్య, బీజేపీ నాయకులు శ్రీనివాసులు, మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో : అనారోగ్యంతో చికిత్స చేయించుకోవడానికి ఆరోగ్య శ్రీ వర్తించని వారికి చికిత్స అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్‌ఎఫ్) కింద ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వందేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 32 మంది అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న వారికి రూ.27.93 లక్షలు చెక్కులను అందజేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ఇప్పటికి 6 సార్లు సీఎంఆర్ ఎఫ్ కింద ఆర్థిక సహకారం ప్రజలకు అందజేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మార్తల గురివిరెడ్డి, నూరి, తలారిపుల్లయ్య, రామాంజనేయులరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

వివాదాస్పద డాబా కూల్చివేత

దువ్వూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం ఇడమడక వద్ద వివాదాస్పదంగా ఉన్న ఒక డాబాను అధికారులు కూల్చివేశారు. రెవెన్యూ, పోలీసు శాఖ జోక్యంతో నాలుగు రోడ్ల రహదారి పక్కన అనుమతి లేకుండా నిర్వహించడమే ఇందుకు కారణంగా రెవెన్యూ అధికారుల వైపు నుంచి వినపడుతున్న వాదన.

పీర్లకు సానికెలు

పోరుమామిళ్ల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని ఉద్దికట్టవీధిలో ఉన్న మౌళాలి పెద్దపీరయ్యస్వాముల వారికి రామాయపల్లె గ్రామస్థులు సానికెలు, గంధం, రెండు ట్రాక్టర్లతో ఎద్దులబండి మొద్దులుతో ప్రతి ఇంటి నుంచి సొంగ్యాన్ని మంగళ వాయిద్యాలతో డప్పులు, కర్రసాములతో వైభవంగా తీసుకువెళ్లారు. గత 40 ఏళ్ల నుంచి రామాయపల్లెకు చెందిన పిడుగువారి పూర్వీకుల ఆచారం ప్రకారం పీర్లకు సానికెలు తీసుకెళ్లడంఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం సానికెలు తీసుకెళ్లారు.

రైతులు పండ్లతోటలు సాగు చేయాలి



పండ్ల మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఖాజీపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తు న్నందున ఆసక్తిగల రైతులు పండ్లతోటలు సాగు చేసుకోవాలని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ సూచించారు. మంగళవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మండల పరిధికి 70 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని, అయితే 21 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారన్నారు. అనంతరం పండ్ల తోటల పెంపకంలో పాల్గొన్న కూలీలతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామంలో పశువుల కోసం నిర్మిస్తున్న నీటి తొట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పత్తూరు పంచాయతీలోని నాగపట్నంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టిని ప్రారంభించారు. కాగా కూనవారిపల్లె, నాగపట్నం గ్రామ ప్రజలు కడప-కర్నూలు జాతీయ రహదారిలో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యేకు చూపించి రోజు ఏదో ఒక సంఘటన జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నామని పరిష్కారం చూపాలని విన్నవించుకున్నారు. ఎంపీడీవోను ఆ సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నంద్యాల సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, హరినాథరెడ్డి, పుల్లయ్యనాయుడు,గంగినాయుడు, మురళి, క్రిష్టారెడ్డి, రామసుబ్బయ్య, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపితే అధిక దిగుబడులు సాధించవచ్చని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఉపాధి హామీ నిధులతో మండల పరిదిలోని చెన్నమరాజుపల్లె గ్రామంలో ఉద్యాన పంటల సాగులో భాగంగా టెంకాయ మొక్కలను నాటారు. చెన్నమరాజుపల్లెకు చెందిన రైతు మల్లికార్జున పొలంలో ఒకటిన్నర ఎకరా విస్తీర్ణంలో సుమారు 50 మొక్కలను నాటారు. పంట సాగులో భాగంగా మూడేళ్ల కాలపరిమితిలో ఉపాధి హామీ నిధుల కింద వంద రోజుల పనిదినాలతోపాటు రూ.1.45 లక్షలను కేటాయించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఉపాధి ఏపీవో మహేశ్వరరెడ్డి, ఈసీ విజయకుమార్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

చెత్తకుప్పలో మందులపై వైద్యాధికారుల ఆగ్రహం

- డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ
- ఆరుగురికి మెమోలు జారీ



కాలిన మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

ప్రొద్దుటూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో చెత్తతోపాటు తగులబడిన ప్రభుత్వ మందుల వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులలో రక్తహీనత నివారణకు ఉపయోగించే ఐరన్, కాల్షియం మందులు, సిరఫ్‌లు కొత్తపల్లె పంచాయతీ ఆవరణలో చెత్తకుప్పలో తగులబడుతూ బయటపడ్డ వ్యవహారం పాఠకులకు తెలిసిందే. ఈ సంఘటనపై మంగళవారం జిల్లా వైద్యాధికారి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ కేంద్రాల్లో పనిచేసే ఆశా కార్యకర్తలకు హెచ్చరికలు జారీ చేశారు. సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని పేర్కొన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమన్, కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. చెత్తకుప్పలో కాలిన మందులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని ఔషధాల స్టాకును పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల ధాటికి మందులు తడవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక పడవేసినట్లు అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో అక్కడి మందులను కల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏఎన్ఎంతోపాటు అయిదుగురు ఆశా కార్యకర్తలకు మెమోలను జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సమస్యాత్మక, కాలం చెల్లినమందులను అధికారులకు తెలియజేసి పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే వేటు తప్పదని హెచ్చరికలు జారీ చేశారు.

ఓటర్ల జాబితా పక్కాగా సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరెడ్డి

జమ్మలమడుగు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాలో తప్పులు రాకుండా ఇంటింటికి వెళ్లి జాబితాలో సరిచేయాలని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, ఇతర మండలాల తహసీల్దార్లు సూచించారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో భారత ఎన్నికల సంఘం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గానికి సంబంధించి బీఎల్‌వో అధికారులు 315 మందికి ఈనెల 16వ తేదీ వరకు రోజుకు 50 మందికి శిక్షణ తరగతులు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ప్రతి బీఎల్‌వో ఓటరు జాబితాను తీసుకుని ఇంటింటికి వెళ్లి చనిపోయిన వారి పేర్లు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు లక్ష్మీనారాయణాచారి, నరసింహులు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ వివేకానందరెడ్డి, బీఎల్‌వోలు, పాల్గొన్నారు.

ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ



జమ్మలమడుగు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76 వ జయంతిని పురష్కరించుకుని మంగళవారం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యం లో ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, క్యాంబెల్ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకు ముందు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ముల్లా జానీ, పోరెడ్డి మహేశ్వరరెడ్డి, గజ్జెల లక్షుమయ్య, గజ్జెల కిరణ్, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, కొమెర్ల మోహన్‌రెడ్డి, కేకే రమణారెడ్డి, తదితరులున్నారు.

పశుగ్రాసాల సాగు రైతులకు లాభదాయకం



గంగనపల్లెలో పశుగ్రాసంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

కాశినాయన జూలై8(ఆంధ్రజ్యోతి) పశుగ్రాసాల సాగు పాడి రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని కడప డీడీ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగనపల్లె గ్రామంలో స్థానిక పశువైద్యుడు డాక్టర్ రామారావు అధ్యక్షతన పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పశుగ్రాసంలో ఏకవార్షిక, బహువార్షిక పశుగ్రాసాలపై రైతులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో పోరు మామిళ్ల ఏడీ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ గురివిరెడ్డి (వనిపెంట పశువైద్యుడు) గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో బయో ఎరువులు శ్రేయస్కరం

ప్రొద్దుటూరు రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రైతన్నలు పంట సాగులో రసాయనిక ఎరువులను తగ్గించి బయో ఎరువులను వాడడం వల్ల ప్రయోజనాలున్నాయని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎల్.అనిత, ఏవో డాక్టర్ సాంబవరాహరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు రాజోలి నుంచి సరఫరా అయిన ఆర్‌జీఎల్ 734, ఆర్‌జీఎల్ 738, అడాప్టివ్ రకం మినీ కిట్లు (వడ్లు) పంపిణీ చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

ముద్దనూరు జూలై8(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఓబులాపురం గ్రామానికి చెందిన బాలిరెడ్డి(55)అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. ఈ నెల 6 వ తేదీన ప్రమాద వశాత్తు క్రింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.